

పెన్నులు, బుక్కులు పంపిణీ

రామగిరి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని కేజీబీవీ విద్యార్థినులకు అర్చక దంపతులు పెన్నులు, బుక్కులు గురువారం పంపిణీ చేశారు. కస్తూర్బా పాఠశాలలోని సుమారు 205 మంది విద్యార్థినులకు భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల విజయసారథి మాధవి దంపతులు విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్కులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి మంజుల, కొలిపాక సారయ్య పాల్గొన్నారు.



అన్నదాతల నిరీక్షణ

- మూడెకరాలలోపు ఉన్న 1,14,313 మందికి అందిన రైతు భరోసా
- ఇంకా 45 వేల మందికిపైగా ఎదురుచూపు
- పంట ముగింపు దశకు వస్తున్నా అందని సాయం
- ఆందోళన చెందుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా ఇప్పటి వరకు కేవలం మూడు ఎకరాలు గల రైతులకు మాత్రమే సాయం అందింది. మిగతా రైతుల ఖాతాల్లో భరోసా డబ్బులు జమ కాక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజులుగా ఎప్పుడెప్పుడు తమ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయా అని రైతులు నిరీక్షిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు పథకాన్ని అమలు చేశారు. ధరణి పోర్టల్‌లో వ్యవసాయ భూములుగా పట్టాలు కలిగిన రైతులందరికీ ప్రతి సీజన్‌లో ఎకరానికి ఐదు వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేసింది.

ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే ఎకరానికి 7,500 రూపాయల చొప్పున రైతులతో పాటు కౌలు రైతులకు కూడా డబ్బులు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. రైతు కూలీలకు కూడా భరోసాను అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. గడిచిన వానాకాలం సీజన్ నుంచే రైతు భరోసా అమలు చేస్తుందని అంతా ఎదురుచూశారు. ఆ సీజన్‌లో రెండు లక్షల రూపాయల వరకు రుణ మాఫీ పథకాన్ని అమలు చేసింది. జిల్లాలో 450 కోట్ల రూపాయల వరకు సంబంధిత రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులను జమ చేసింది. కానీ ఆ సీజన్‌లో రైతు భరోసా ప్రారంభించ లేదు. ఈ యాసంగి సీజన్ నుంచి సాగుకు యోగ్యమైన భూములు కలిగిన రైతులకు మాత్రమే రైతుభరోసా ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అది కూడా ఎకరానికి ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా 7,500 రూపాయలు కాకుండా ఆరు వేల రూపాయలు ఇస్తామని ప్రకటించారు. ఈ మేరకు సాగులో ఉన్న భూములను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సర్వే చేశారు.

రూ. 82.57 కోట్లు జమ

ఇప్పటి వరకు మూడెకరాల వరకు గల 1,14,313 మంది రైతులకు 82 కోట్ల 57 లక్షల 68 వేల 13 రూపాయలు జమ చేసింది. మూడు ఎకరాలకు పైగా భూములు కలిగిన దాదాపు 45వేలకు పైగా రైతులకు 51 కోట్ల రూపాయల వరకు జమ చేయాల్సి ఉంది. ఎప్పుడు తమ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయా లేదా అని రైతులు బ్యాంకులకు వెళ్లి ఆరా తీస్తున్నారు. డబ్బులు పడలేదనే సమాధానాలతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఈ డబ్బులు జమ కాక పోగా,

మిగతా 8వ పేజీలో

సాగులో లేని భూములు 2655 ఎకరాలు..

జిల్లాలో ధరణి పోర్టల్ ప్రకారం పట్టా కలిగిన భూములు 2,78,555 ఎకరాల భూములు ఉండగా, ఇందులో పంటలు సాగు చేయని బంచరాయి భూములు, రియల్ ఎస్టేట్ భూములు, నాలా కన్వర్షన్ చేయకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తున్న 2655.32 ఎకరాల భూములు సాగులో లేవని గుర్తించారు. 2,75,899 ఎకరాల భూములు సాగులో ఉన్నట్లు తేల్చారు. మొత్తం 1,61,032 మంది రైతులకు రైతు భరోసా కింద 165 కోట్ల 53 లక్షల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. జనవరి 26వ తేదీ నుంచి రైతు భరోసా పథకాన్ని ప్రారంభించారు. మొదట మండలానికి ఒక గ్రామంలో పూర్తి స్థాయిలో రైతులందరికీ రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన ప్రభుత్వం ఆ తర్వాత ఒక ఎకరం గల రైతులకు డబ్బులు జమ చేయడం ఆరంభించారు. ఇంతలో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. రైతు భరోసా డబ్బులు జమ అవుతాయో, కావోనని రైతులు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ ఎన్నికల కమిషన్ రైతు భరోసా డబ్బులు జమ చేసే విషయమై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవడంతో ప్రభుత్వం ఆపథకాన్ని కొనసాగించింది.

హుస్సేన్‌మియా వాగులోకి ఎస్సారెస్పీ నీరు

- ఊపిరి పీల్చుకున్న రైతులు



హుస్సేన్‌మియా వాగులో పారుతున్న నీరు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌మియావాగులోకి నీరు రావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. యాసంగిలో వాగు పరివాహక ప్రాంత రైతులు వరిపంట వేశారు. వరిపంటకు నీరందక రైతులు ఆందోళనకు గురికావడంతో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీ జడ్పీటీసీ సారయ్యగౌడ్ ప్రత్యేక చర్య తీసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడారు. దీంతో అధికారులు ఎస్సారెస్పీ నీటిని హుస్సేన్‌మియావాగులోకి మళ్లించారు. మండలంలోని మడిపల్లి, మంగపేట, కూనారం, గంగారం, కాల్వశ్రీరాంపూర్, చిన్నరాతుపల్లి, పెద్దరాతుపల్లి రైతులు వాగుపరివాహక ప్రాంతంలో సుమారు వందలాది ఎకరాలలో వరిపంట వేశారు. పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేయడంతో వాగుపరివాహక ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఓటమికి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలే కారణం

- సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

పెద్దపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ఓటమికి కారణం కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలేనని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఒక ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేల సమన్వయ లోపంతో పాటు అంతర్గత విభేదాలు కారణమని, మిత్రపక్షాలను కలుపుకోకపోవడంతో పాటు ఒంటెద్దు పోకడలతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడిపోయి బీజేపీ అభ్యర్థి గెలిచాడన్నారు. ముఖ్యమంత్రి మూడు ఉమ్మడి జిల్లాలలో బహిరంగ సభలు పెట్టినా పట్టభద్రుల్లో ఉద్యోగాలు ఇస్తారనే విశ్వాసం కోల్పోయారని, సంవత్సర కాలం గడిచినా నిరుద్యోగుల్లో ఉద్యోగ భద్రతపై ఆశ లేకనే రాష్ట్రంలో బీజేపీకి అవకాశం ఇచ్చారన్నారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు వామపక్షాలతో పాటు అందరినీ కలుపుకొని పోవాలని సూచించారు.

ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం

- 4,796మంది విద్యార్థుల హాజరు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ రెండవ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ భాష పరీక్షలు 23 పరీక్ష కేంద్రాల్లో జరిగాయి. కాగా ఈ పరీక్షకు 4,900మంది విద్యార్థులకు గానూ 4,796 మంది హాజరు కాగా 104మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. జనరల్ విద్యార్థులు 3,944మందికి గాను 3,879మంది హాజరు కాగా 65 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 956 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 917మంది విద్యార్థులు హాజరుకాగా 39మంది గైర్హాజరయ్యారు.

పంచాయతీ కార్యదర్శుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా నిషాంత్, మహేందర్



నిషాంత్



మహేందర్

పెద్దపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం కమిటీ ఆధ్వర్యంలో గురువారం పెద్దకల్వల క్యాంపు లోని ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించి జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా నిషాంత్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, అసోసియేట్ అధ్యక్షులుగా కృష్ణ, ఉమాపతి రెడ్డి, ఉపాధ్యక్షులుగా శరత్, భానుప్రసాద్, సాగర్‌రావు, శ్రావణ్, నరేష్, మసీయొద్దీన్, జాయింట్ సెక్రటరీలుగా తిరుపతి, మౌనిక, అంజలి, సత్యనారాయణరెడ్డి, సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజ్‌కుమార్, కోశాధికారిగా మారుతి ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శిగా సోనియా, కల్చరల్ కార్యదర్శిగా లలిత, ఈసీ మెంబర్లుగా జుహిబ్, కిరణ్‌కుమార్, రవి, టి రవి, ఎ సతీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి టీఎస్జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, తెలంగాణ పంచాయతీ కార్య దర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సందిలా బలరాం, రాష్ట్ర అసోసి యేట్ అధ్యక్షుడు శ్రవణ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈసందర్భంగా నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలుపుతూ వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

9, 10తేదీల్లో ముర్మూర్ కొమురన్న జాతర

జాతర కమిటీ చైర్మన్ గోపు ఐలయ్యయాదవ్

అంతర్గాం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ శివారు బ్రాహ్మణపల్లి పంప్‌హౌజ్ వద్ద ఈనెల 9, 10 తేదీల్లో కొమురన్న జాతరను నిర్వహించనున్నట్టు జాతర కమిటీ చైర్మన్ గోపు ఐలయ్యయాదవ్ తెలిపారు. మొదటి రోజు 9న ఆదివారం దృష్టి కుంభం, మైలలు తీయుట, రుద్రాభిషేకం, పెద్ద పట్నం వేయుట, వాక్సిద్ధి శ్రీ మేడలా దేవి సహిత శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 10న సోమవారం అగ్నిగుండం ప్రవేశంతో పాటు ఒగ్గు కళాకారులచే ఒగ్గు కథ ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యం కోసం జాతర ప్రదేశంలో చలువ పందిళ్ళు ఏర్పాటు, తాగునీటి వసతి, వీధి దీపాల ఏర్పాటుతో పాటు అన్నదానం నిర్వహించనున్నట్టు వివరించారు. గోదావరిఖని బస్‌స్టాండ్ నుండి జాతర ప్రదేశం వరకు ఆర్‌టీసీ బస్సులు నడుపనున్నట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని గోపు ఐలయ్య యాదవ్ కోరారు. జాతర కమిటీ ప్రతినిధులు ఎలుక కొమురయ్యయాదవ్, మాజీ సర్పంచ్ బాదరవేని స్వామి, గోపు మల్లేష్ పాల్గొన్నారు.

వేతనాలు అందక ఇబ్బందులు

రెండు నెలలుగా ఉపాధిహామీ సిబ్బంది ఎదురుచూపులు



7

బీజేపీ నాయకుల సంబరాలు

8

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల హామీలను అమలు చేయాలి

ఆర్ఎఫ్‌సీఎల్‌లో నేడు టోకెన్ సమ్మెకు పిలుపు

- వ్యతిరేకిస్తున్న మరో కాంట్రాక్టు కార్మిక సంఘం

కోల్‌సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)లో శుక్రవారం టోకెన్ సమ్మెకు ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ పిలుపునిచ్చింది. గురువారం ఏఎల్‌సీ సమక్షంలో చర్చలకు ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం హాజరు కాకపోవడంతో టోకెన్ సమ్మె నిర్వహిస్తున్నట్టు కార్మిక నాయకుడు నరేష్ పేర్కొన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో గతంలో లోడింగ్ పనులు నిర్వహించిన వీఎల్ అరోర కంపెనీతో ఐఎఫ్‌టీయూ నాయకులు చేసుకున్న ఒప్పందం గత ఏడాది నవంబరుతో ముగిసింది. ఈ ఒప్పందంలో తప్పులు దొర్లడం వల్ల కార్మికులకు నష్టం జరిగిందని కార్మికులు ఆరోపిస్తూనే వస్తున్నారు. తమతో బలవంతంగా హడావిడిగా ఒప్పందంపై సంతకాలు చేయించారని, దీంతో ఒప్పంద వివరాలు గమనించలేకపోయామని కార్మిక నాయకులు పేర్కొంటూ వస్తున్నారు. గత ఏడాది నవంబరు నుంచి కొత్తగా చౌదరి కంపెనీ లోడింగ్ పనులు నిర్వహిస్తున్నది. ఇప్పటి నుంచి కొత్త ఒప్పందం చేసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో జాతీయ, ప్రాంతీయ కార్మిక సంఘాలకు అనుబంధంగా కాంట్రాక్టు కార్మిక సంఘాలు లేకపోవడం కూడా కార్మికులకు ఇబ్బందికరంగా మారింది. గతంలోని వివాదాల నేపథ్యంలో ఆర్ఎఫ్‌సీఎల్ అంటేనే కార్మిక సంఘాల నాయకులు వెనుకడుగు వేసే పరిస్థితి ఉంది. కాగా యాజమాన్యం మాత్రం అది కాంట్రాక్టర్‌కు, కార్మికులకు మధ్య సమస్య అని, తమకు సంబంధం లేదని ఏఎల్‌సీకి ఇచ్చిన లేఖలో పేర్కొన్నది. దీంతో ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ శుక్రవారం టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చింది. మరో వైపు ఇటీవల కొందరు కాంగ్రెస్ నాయకులు కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి ఆర్ఎఫ్‌సీఎల్‌లో కొత్తగా యూనియన్ పెట్టారు. నెలకంటి రాము, కందుల సతీష్, రాజ్‌కుమార్ తదితరులు ఈ యూనియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా ఈ టోకెన్ సమ్మెను ఈ కార్మిక సంఘం వ్యతిరేకిస్తుంది. గతంలో కార్మికులను అడ్డంపెట్టుకుని దోచుకున్నారని, నెలవారీ జీతాలు తీసుకున్నారని ఆరోపిస్తున్నారు. ఈ సమ్మెకు దూరంగా ఉండాలని ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మిక సంఘం పేర్కొంటున్నది. ఈ పరిస్థితుల్లో ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికులు ఏ విధంగా స్పందిస్తారనేది చర్చనీయాంశం అయ్యింది.

కనీస వేతనం చెల్లించాలి

పెద్దపల్లిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న నిత్యావసర సరుకులు, వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వేల్పుల కుమారస్వామి, సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాల డ్రాఫ్ట్ జీవోలను గత ఏడాది విడుదల చేసిందని, వేతనాల నిర్ణయం అశాస్త్రీయంగా చేసిందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ జీవోలను సవరించాలని, కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలుగా నిర్ణయించి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం రామాచారి, తాండ్ర అంజయ్య, సీహెచ్ అరవింద్, వివిధ సంఘాల నాయకులు ఎన్ శంకర్, జి లక్ష్మారెడ్డి, బ్రహ్మాచారి, మహేందర్, ఎండీ కాజా , లక్ష్మీనారాయణ, ఉపేందర్, బొంకూరి సాగర్, మల్లేష్, తిరుపతి, మహేష్, గట్టయ్య, చందు, సురేష్, అంబాల లక్ష్మణ్, శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కోల్‌సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో రామగుండం నగరపాలక సంస్థ 14వ డివిజన్ లక్ష్మీపురంలో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు భానుప్రసాద్, సాయిగణేష్ తమ సిబ్బందితో విద్యార్థులకు, గ్రామస్థులకు పరీక్షలు జరిపారు. అవసరమైన మందులు అందించారు. ప్రతీనెల వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు వైద్యులు పేర్కొన్నారు. ఎన్టీపీసీ సంస్థతో వైద్య శిబిరం నిర్వహించడంపై కాంగ్రెస్ నాయకులు కందుల సతీష్, సంతోష్, ముత్యాల ప్రసాద్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాజీపేట్ అజ్నీ ప్యాసింజర్ రైలు తిరిగి మళ్లీ ప్రారంభించిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ఎంపీ వంశీకృష్ణ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని ఎంపీ వంశీకృష్ణ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారని తెలిపారు. తిరుమల తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలును హాల్టింగ్ చేయించాలని, జనతా ఎక్స్‌ప్రెస్ రైలును మళ్లీ హాల్టింగ్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లం సతీష్, గుండేటి ఐలయ్య, పచ్చిమట్ల శ్రీనివాస్, పల్కల సాగర్ రెడ్డి, అల్లివేలి రవీందర్ రెడ్డి, తూడి సమ్మయ్య, పల్కల కరుణాకర్ రెడ్డి, సతీష్, రాజయ్య, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

రాఘవపూర్‌లో 'పొలం బాట'

పెద్దపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్‌లో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డివిజనల్ టెక్నికల్ ఇంజనీర్ రవి మాట్లాడుతూ రైతులు ఎవరూ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్‌లు వేసుకోవద్దని, సిబ్బందికి ఫోన్ చేస్తే వారే మారుస్తారని పేర్కొన్నారు. అందరూ మోటర్లకు కెపాసిటర్‌లను బిగించుకోవాలని, తద్వారా లైన్‌లో లోడ్ తగ్గుతుందని, ట్రాన్స్ఫార్మర్ కాలిపోకుండా ఉంటాయని సూచించారు. ప్రైవేట్ వ్యక్తులకు లైన్‌లోకి రైతులు తీసుకెళ్లవద్దని తెలిపారు. కరెంట్ ఎలా ఉందని రైతులను అడుగగా అంతా బాగుందని, విద్యుత్ శాఖ సిబ్బంది కూడా సహకరిస్తున్నారని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

పాలకుర్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బామ్లానాయక్ తండా మాజీ సర్పంచ్ రాజునాయక్ దంపతులు ఓ యువతి వివాహానికి ఆర్థిక సాయం అందించారు. గురువారం రాజీవ్‌తండాలో జరిగిన లాస్య ఆనంద్‌ల వివాహ మహోత్సవానికి హాజరైన రాజు నాయక్ నూతన వధూవరులను ఆశీర్వదించి 10వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, కిషన్, విజయ, రాజే ష్, మౌనిక, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లు 68 శాతం

- రామగుండంలో కార్పొరేషన్‌లో ప్రైవేట్ భవనాల వసూళ్లు 58 శాతమే
- శివారు గ్రామాలు, కాలనీల్లో భారంగా ఆస్తి పన్ను
- ప్రభుత్వ సంస్థ నుంచి 97శాతం వసూళ్లు



కోల్‌సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు డిమాండ్‌లో 68శాతం ఆస్తి పన్ను వసూలు అయ్యింది. నగరపాలక సంస్థ పరిధిలో 67,249 కట్టడాలు ఉండగా ఇందులో ప్రభుత్వ ప్రభుత్వరంగ సంస్థల పరిధిలోని కట్టడాలు, ప్రైవేట్ కట్టడాలుగా విభజించారు. ప్రైవేట్ కట్టడాలు 50,950 ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో ఆరు డివిజన్లలో మాత్రమే ప్రైవేట్ భూములు, కాలనీలు ఉన్నాయి. మిగతా కట్టడాలన్నీ ప్రభుత్వ రంగ సంస్థలైన సింగరేణి, జెన్‌కో, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, ఆర్‌టీసీ, పోలీస్ వంటి సంస్థల ఆధీనంలో ఉన్నాయి. సింగరేణి, జెన్‌కో, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ సంస్థలకు ప్రత్యేక కాలనీలే ఉన్నాయి. దీనికి తోడు సింగరేణి, జెన్‌కో భూముల్లో ప్రైవేట్ వ్యక్తులు ఇళ్లు నిర్మించుకున్న కాలనీలే ఎక్కువగా ఉన్నాయి.

రామగుండంలో వ్యాపార కేంద్రాలు అభివృద్ధి చెందకపోవడంతో పెద్దపెద్ద భవనాలు లేకపోవడంతో ఆస్తి పన్ను డిమాండ్ కూడా ఇతర ప్రాంతాలతో పోల్చితే తక్కువగానే ఉంటుంది. మూడు లక్షల జనాభా ఉన్న నగరానికి ఆస్తి పన్ను ప్రైవేట్ కట్టడాలకు సంబంధించి రూ.16.26 కోట్లు, ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించి రూ.5.21కోట్ల డిమాండ్ మాత్రమే ఉన్నది. మొత్తం రూ.21.47కోట్లు ఆస్తి పన్ను డిమాండ్ ఉన్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గడిచిన 11నెలల కాలానికి 68 శాతం ఆస్తి పన్ను వసూలు అయ్యింది. ప్రైవేట్ కట్టడాలకు సంబంధించి 50,950 కట్టడాల నుంచి రూ.9.22 కోట్లు 58 శాతం వసూలు అయ్యాయి.

ప్రతీరోజు సరాసరి రూ.1.5లక్షల నుంచి రెండు లక్షల రూపాయలు వసూలు అవుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించి రూ.5.21కోట్ల డిమాండ్ ఉండగా సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థలు ఎర్లీబర్డ్ ఆఫర్‌ను వినియోగించుకున్నాయి. సింగరేణి ఆర్‌జీ-1కు సంబంధించి రూ.73.76లక్షలు, ఆర్‌జీ-2కు సంబంధించి రూ.44.6లక్షలు పన్ను చెల్లించాయి. ఎన్టీపీసీ 2.28 కోట్లు, ఆర్ఎఫ్‌సీఎల్ 1.26కోట్లు పన్ను చెల్లించాయి. ప్రస్తుతం పోలీస్‌శాఖకు సంబంధించి పోలీస్ కమిషనరేట్, నివాసాలు, పోలీస్‌స్టేషన్లకు సంబంధించి రూ.5.28 లక్షలు, బీఎస్ఎన్ఎల్ రూ.8.09లక్షలు బకాయిలు ఉన్నాయి.

శివారు గ్రామాలు, కాలనీలకు భారం...

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో గ్రామీణ ప్రాంతాలైన పాత రామగుండం, మల్యాలపల్లి, మల్కాపురం, మేడిపల్లి, న్యూపోరట్‌పల్లి, శాలపల్లి, లక్ష్మీపురం, వీర్లపల్లి, జనగామ, అల్లూరు, మారేడుపాకలు ఉన్నాయి. ఇవి పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామాలు. రామగుండం నోటిఫైడ్ ఏరియాగా ఏర్పాటుచేసిన సమయంలో ఈ గ్రామ పంచాయతీలను విలీనం చేశారు. గ్రామాల పరిధిలో నివాసాలు, పశువుల కొట్టాలు వైశాల్యంలో పెద్దగా ఉంటాయి. కొన్ని గ్రామాల్లో నివాసాలు శిథిలమై వలసలు సైతం వెళ్లారు.

మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా అవతరించిన తరువాత గ్రామాల్లోని నివాసాలకు భారీగా ఆస్థి పన్ను పెరిగింది. కొన్ని గ్రామాల్లో నివాసాల విలువ కంటే ఆస్తి పన్ను బకాయిలే ఎక్కువగా ఉన్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. పలు గ్రామాల్లో శిథిలమైన ఇళ్లకు ఆస్తి పన్ను తీసివేయాలని మొరపెట్టుకున్నా పట్టించుకునే పరిస్థితే లేదు. దీనికి తోడు 50, 60ఏళ్ల క్రితం నాటి పాత నివాసాలకు కూడా అనుమతులు లేవని అన్ అథరైజ్ కన్‌స్ట్రక్షన్(యూఏసీ) పేర 100శాతం అదనపు పెనాల్టీలు ఆస్తి పన్నులో వేస్తున్నారు. దీంతో తాము ఆస్తి పన్ను కట్టలేమని శివారు గ్రామాల్లో ప్రజలు చేతులెత్తేస్తున్నారు. కార్పొరేషన్ సిబ్బంది ఎన్నిసార్లు తిరిగినా స్పందించే పరిస్థితి లేదు.



మధుర ఫలం ఖర్జూరం

● పరిపూర్ణ ఆరోగ్యం, సౌందర్యానికి వరం
● రంజాన్ సంప్రదాయ ఫలం ● పోషకాలు ఎన్నో.

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎన్నో పోషకాలు ఉన్న ఎడారి పండు ఖర్జూరం. ఔషధ గుణాలు ఎక్కువగా ఉన్న ఖర్జూర ఫలంతోనే ముస్లింలు రంజాన్ మాసంలో ఉపవాసాన్ని విరమిస్తారు. మహ్మద్ ప్రవక్త ఖర్జూర ఫలాన్ని ఎంతో ఇష్టంగా ఆరగించేవారని, అందుకే ఖర్జూర ఫలం ముస్లింలకు సంప్రదాయ ఫలంగా మారిందని చెబుతారు. అందుకే సాధారణ రోజుల్లో ఖర్జూరం మార్కెట్‌లో తక్కువగా కనిపించినా రంజాన్ మాసంలో ఎక్కువగా దిగుమతి అవుతాయి.

40 రకాల ఖర్జూర పండ్లు ఇప్పుడు మార్కెట్‌లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. గల్ఫ్ దేశాల నుంచి అందులో అత్యధికంగా సాగుచేసే ఇరాక్, ఇరాన్, సౌదీఅరబ్, యెమెన్, అల్జీరియా, మొరాకో దేశాల నుంచి 80శాతం వరకు హైదరాబాద్, బెంగుళూర్ వంటి నగరాలకు లక్షలాది టన్నులు దిగుమతి అవుతుంది. ఖర్జూర పండ్లలో అత్యంత ఖరీదైనది అజ్వా ఖర్జూరం కిలో రూ.1800 నుంచి రెండు వేల వరకు ధర పలుకుతుంది. మిగతా రకాలు రూ.60 నుంచి రూ.600 వరకు ఉంటాయి. ఖర్జూరం రుచికరంగా ఉండడమే కాకుండా పోషకాలు మెండుగానే ఉంటాయి.

ఖర్జూరంలో ఉండే పోషకాలు..

ఖర్జూర పండ్లలో పోషకాలు, ఔషధ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఇందులో గ్లూకోజ్, ఫ్రూటోజ్ వంటి ప్రకృతి సిద్ధమైన చక్కెర పదార్థాలు ఉంటాయి. దీంతో శరీరంలో త్వరగా కలిసిపోయి శక్తినిస్తాయి. వంద గ్రాముల ఖర్జూర పండ్లలో నీరు 15.3 శాతం, ప్రోటీన్‌లు 2.5 శాతం, కొవ్వు 0.4 శాతం, కార్బోహైడ్రేట్ 75.8 శాతం ఉంటాయి. 120ల మిల్లీ గ్రాముల కాల్షియం, 50 మిల్లీగ్రాముల పాస్ఫరసం, 7.3 మిల్లీ గ్రాముల ఇనుము, 3 మీల్లీగ్రాముల విటమిన్ సీ, కొంత విటమిన్ బీ వంటివి ఉంటాయి. ఖర్జూరం ద్వారా కొలస్ట్రాల్ పెరుగుతుందనే భయం కూడా లేదు. వంద గ్రాముల్లో 315 క్యాలరీలు ఉన్నాయి.



ఖర్జూరం నిల్వ ఉంచుకునే పద్ధతి..

ఖర్జూరం పండ్లు ఎంతో రుచిగా ఉంటాయి. వీటిని నిల్వ ఉంచుకోవడానికి కొన్ని పద్ధతులు పాటించాలి. గాలి చొరబడకుండా డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో ఉంచితే ఖర్జూరం పండ్లు నెలరోజులు నిల్వ ఉంటాయి. ఎక్కువ ఖర్జూరాలు నిల్వ ఉంచుకోవాలనుకుంటే మరికొన్ని పద్ధతులు ఉంటాయి. ఖర్జూరాలు ప్రాసెసింగ్ ద్వారా పంచదార, జామ్, జెల్లీ, జ్యూస్, సిరప్‌గా మార్చి విక్రయిస్తుంటారు.

మహిళలకు ఎంతో ఉపయోగం..

ఆరోగ్యం, సౌందర్యాన్ని పెంచే ప్రకృతి ఫలమైన ఖర్జూరం మహిళలకు ఎంతో ఉప యోగపడుతుంది. మహిళల్లో పోషక లోపం ఎక్కువగా ఉంటుంది. ఖర్జూరం వారికెంతో శక్తిని స్తుంది. ప్రతిరోజు గ్లాసు పాలతో ఖర్జూరాలను తింటే పరిపూర్ణ ఆరోగ్యాన్ని స్తుంది.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లి తండాకు చెందిన అజ్మీరా రాజుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలోని అజ్మీరా రాంసింగ్ ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రహదారి పనులను ఈనెల 4న స్థానిక వాటర్ ట్యాంకు నుంచి కెనాల్ వరకు చేపట్టాడని పేర్కొన్నారు .అదేరోజు అజ్మీరారాజు తన వ్యవసాయ పొలం నుంచి ఎందుకు సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని రాంసింగ్ భార్య లక్ష్మీ, అతని కొడుకు సాయి కుమార్‌లను ప్రశ్నించాడని చెప్పారు. అంతటితో ఆగని అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు రోడ్డు పనులు చేస్తే చంపి వేస్తానంటూ దాడికి దిగాడని తెలిపారు. బాధితుడు రాంసింగ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

ప్రాణం తీసిన ఇసుర్రాయి వివాదం

● గోదావరిఖనిలో వృద్ధురాలి ఆత్మహత్య

కోల్‌సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని రమేష్‌నగర్‌లో ఇసుర్రాయి (తిరగలి) విషయంలో తలెత్తిన వివాదం ఒక వృద్ధురాలి ఆత్మహత్యకు దారి తీసింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్లెర్ల యశోద(65) గోదావరిఖని రమేష్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఆమె ఇంటికి పొరుగున ఉండే మాశెట్టి కళావతి ఇంట్లో ఇటీవల శుభకార్యం జరిగింది. ఆ శుభకార్యానికి యశోద ఇంట్లోని ఇసుర్రాయిని తీసుకెళ్లారు.



పల్లెర్ల యశోద(ఫైల్)

రోజులు గడిచినా ఇవ్వకపోవడంతో తిరిగి ఇవ్వమని యశోద అడిగింది. అది కనిపించడం లేదని వారు దురుసుగా సమాధానం చెప్పారు. ఈ విషయమై కళావతి, యశోద మధ్య గురువారం గొడవ జరిగింది. కళావతి కోడలు రమ్యశ్రీ అక్కడికి వచ్చి యశోదను తిట్టింది. కళావతి, ఆమె కోడలు రమ్యశ్రీ కలిసి యశోదను నెట్టివేయడంతో ఆమె కిందపడిపోయింది. స్థానికులు యశోదను లేపి ఇంట్లోకి పంపారు. కాలనీవాసుల ముందు తనను అవమానపరిచారనే మనోవేదనతో యశోద ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. యశోద కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు మాశెట్టి కళావతి, ఆమె కోడలు రమ్యశ్రీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ భూమేష్ తెలిపారు.

గొర్రెలు మాయంపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ముగ్గురు మాంసం విక్రయదారులకు చెందిన ఐదు గొర్రెలు మాయంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మిర్యాల్‌కార్ శ్రీకాంత్, మిర్యాల్‌కార్ రాజేశ్, మిర్యాల్‌కార్ ఐలోజీలు కలిసి 14 గొర్రె పొట్టేళ్లను వెంకటాపూర్ సంతలో కొనుగోలు చేసి వారి మందలో విడిచిపెట్టారని తెలిపారు. ఈ నెల 4న మందను అదే గ్రామానికి చెందిన ఒగ్గు ఎల్లయ్య మేత కోసం రెండవ బైపాస్ రోడ్డు వద్దకు తీసుకెళ్లాడు. సాయంత్రం గొర్రెల షెడ్డుకు చేరుకున్న మందలోని 5 గొర్రెలు కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు రూ.50వేల విలువైన తమ జీవాలను అపహరించారని పేర్కొంటూ బాధితుడు మిర్యాల్‌కార్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు. కాగా మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి పోలీసులు ఐదు గొర్రెలను స్వాధీనపర్చుకుని తమకు అప్పగించారని బాధితులు పేర్కొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

- రెండు గ్రామాల్లో విషాదం

చొప్పదండి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన చొప్పదండి మండలంలోని రెండు గ్రామాల్లో విషాదం నింపింది. ప్రేమికులు ఇద్దరు చొప్పదండి మండలానికి చెందినవారు. చిట్యాలపల్లికి చెందిన కొండపర్తి అరుణ్‌కుమార్ కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. భూపాలపట్నంకు చెందిన నాంపల్లి అలేఖ్య కరీంనగర్‌లో డిగ్రీ చదివింది. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారగా అలేఖ్యకు ఇటీవల పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. దీంతో తమ పెళ్లి కాదు అనుకొని ప్రేమికులు ఆత్మహత్యకు పాల్పడడం విషాదాన్ని నింపింది. అలేఖ్య తండ్రి బతుకుదెరువు కోసం గల్ఫ్‌లో ఉంటుండగా, కూతురు మరణవార్త విన్న తల్లిదండ్రి తల్లడిల్లిపోతున్నారు. మరికొద్ది రోజుల్లో పెళ్లి చేద్దామనుకున్న అలేఖ్య, అరుణ్ కుమార్ మరణ వార్త ఇరువురి కుటుంబాలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

ముస్తాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామలక్ష్మణపల్లె గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్సై సీహెచ్ గణేశ్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి నిర్వహించారు. పొలాల వద్ద పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.13,340 తోపాటు కారు, నాలుగు బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. పీసీలు సంతోష్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

- మరో యువకుడికి తీవ్రగాయాలు

మంథనిరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిట్టుపల్లి గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద గురువారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఉదయ్(25) అనే యువకుడు మృతి చెందాడు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన ఉదయ్, మరో యువకుడు మంథనిలో జరిగిన తన స్నేహితుడి చెల్లి పెళ్లికి వచ్చారు. అనంతరం రాత్రి ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో స్నేహితుడి ఇంట్లో పడుకోవటానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బిట్టుపల్లి గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడగా ఉదయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సబ్బితం గ్రామానికి చెందిన పెర్క రాయమల్లు (57) అనే వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయమల్లు భార్య కొంతకాలం క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగగా స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

కోరుట్ల మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

● విధుల్లో నిర్లక్ష్యం వహించాడని కలెక్టర్ వేటు

కోరుట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతిని సస్పెండ్ చేస్తూ గురువారం కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. విధులపై నిర్లక్ష్యం వహించడం, ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు గౌరవ పారితోషికం పంపిణీలో జాప్యం వహించడం తదితర కారణాలతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ బ్యాంకు ఖాతాల్లో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు సంబంధించిన బడ్జెట్‌ను జమ చేసినప్పటికీ వారి ఖాతాలకు బదిలీ చేయడంలో నిర్లక్ష్యం వహించాడని, శానిటేషన్ నిర్వహణపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. అనుమతి లేని లే అవుట్‌ను నిరోధించడంలో విఫలం కావడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయడంలో నిర్లక్ష్యం వహించాడన్న కారణాలతో కమిషనర్ తిరుపతిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన స్థానంలో కోరుట్ల ఎంపీడీవో రామకృష్ణకు పూర్తి అడిషనల్ చార్జిని అప్పగిస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

హత్య కేసు నిందితుల రిమాండ్

జగిత్యాల రూరల్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల రూరల్ మండలంలోని తారక రామ్‌నగర్ గ్రామానికి చెందిన ఎస్‌కే రఫీ(28) అనే వ్యక్తి ఈ నెల1 టీఆర్‌నగర్ శివారు ఎస్సారెస్పీ కాలువ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. దీంతో తండ్రి ఎస్‌కే రజాక్ తన కుమారుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రఫీక్ హత్యకు గురైనట్లు విచారణ జరిపి నిందితులను గుర్తించారు. హత్యకు పాల్పడ్డ నిందితులైన మహమ్మద్ రంజానీ, షేక్ మహమ్మద్, షేక్ శాదవ్‌లను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ ఇన్‌చార్జి సీఐ నీలం రవి, మల్యాల సీఐ పేర్కొన్నారు.

ఆయుర్వేద వైద్యం పేరుతో మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

● తెలుగు రాష్ట్రాల్లో 50 మందిని నమ్మించి రూ.6 లక్షలు వసూలు ● సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి

సిరిసిల్ల క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యం పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న కర్ణాటక రాష్ట్రం చిక్కబల్లాపూర్ జిల్లా గౌరీబిందనూర్ తాలూకా నగిరెగెరే గ్రామానికి చెందిన అజయ్ (20) అనే నకిలీ వైద్యుడిని గురువారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన అజయ్ అనే నకిలీ వైద్యుడు తెలుగు రాష్ట్రాల్లో ద్విచక్రవాహనంపై సంచరిస్తూ అనారోగ్యానికి గురైన అమాయక ప్రజల వద్దకు వెళ్లి వారికి ఉన్న పక్షవాతం, ఇతర అనారోగ్య సమస్యలకు ఆయుర్వేద వైద్యంతో తగ్గిస్తామంటూ రూ.10 వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేసి మళ్లీ వచ్చి వైద్యం చేస్తానని చెప్పి వెళ్లిపోతుంటాడు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అనంతపూర్, మహబూబ్‌నగర్, నారాయణఖేడ్, రంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో నిందితుడు సంచరిస్తూ అమాయక ప్రజలను నమ్మి మోసం చేస్తుంటాడు. ఇదే విధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, శాత్రాజపల్లి, ముస్తాబాద్ మండలంలోని బద్నకల్, వెంకట్రావుపల్లిలో తిరుగుతూ నవంబరు 12, 2024న గంభీరావుపేట మండలంలోని లింగన్నపేటకు వచ్చి కొడిమోజు లక్ష్మి భర్త ప్రభాకర్‌కు పక్షవాతం ఉందని తెలుసుకొని వారింటికి వెళ్లాడు. వ్యాధిని నయం చేస్తానని నమ్మించి ఆమె దగ్గర రూ.20 వేలు ఫోన్‌పే చేయించుకోవడమే కాకుండా బ్లాంకెట్లను తీసుకొని మందులు తెస్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇలా పలు గ్రామాల్లో నకిలీ వైద్యం పేరిట నమ్మించి దాదాపు రూ.6 లక్షల వరకు వసూలు చేశాడు. గంభీరావుపేటలో తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 50మందిని మోసం చేశానని అజయ్ ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా కృషి చేసి ఎస్‌ఐ శ్రీకాంత్, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీనాథ్‌లను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



అజయ్

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి

ఇల్లంతకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన శీలం రజనీకాంత్(26) అనే యువకుడు ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రజనీకాంత్ తంగళ్లపల్లి మండలం జిల్లెల క్రాసింగ్‌కు వెళ్లి గురువారం రాత్రి ఇంటికి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో వాహనంతో సహాపడి మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బావిలో నుంచి తీయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

మంథనిరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ గ్రామం నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. మామిడి రామకృష్ణ, పిట్టల శ్రీనివాస్, మేకల రమేష్‌లు టీఎస్ 25 టీ 6542, టీఎస్ 25 టీ 6622 అనే రెండు టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా టిప్పర్లలో ఇసుక నింపిన ఎక్స్‌కవేటర్ డ్రైవర్, ఓనర్ ఐలి కరుణాకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

బైకు, రెండు ఆటోలను ఢీకొట్టిన కారు

● కారులో బెలూన్లు తెరుచుకోవడంతో తప్పిన పెను ప్రమాదం
● ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

శంకరపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బైకు.. రెండు ఆటోలను ఢీకొట్టి ఓ కారు బోల్తా పడ్డ ఘటనలో ఒకరు తీవ్రంగా, పలువురు స్వల్పంగా గాయపడ్డారు. గురువారం శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారులో ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన గుడిపాటి భూపాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రమాదేవి, సునీత, మానస, సుజాత, అయాన్స్‌లతో కలిసి కారులో కరీంనగర్‌లోని ఓ వివాహానికి హాజరై తిరిగి హనుమకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్, వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్, వంకాయగూడెం గ్రామాల మధ్య కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను, ప్యాసింజర్ ఆటోతో పాటు టాటా ఎస్ ఆటోను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు ప్యాసింజర్ ఆటోను బలంగా ఢీకొట్టడంతో ఆటో నుజ్జునుజ్జు అయింది. ఆటోడ్రైవర్ మానకొండూర్ మండలం గంగిపల్లికి చెందిన రమేష్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. బైకుపై ప్రయాణిస్తున్న మానకొండూర్ మండలం శంషాబాద్‌కు చెందిన డొల్ల సతీష్, టాటా ఏసీ డ్రైవర్ తాడికల్‌కు చెందిన పెరిక రాజమల్లుకు స్వల్ప గాయాలయ్యాయి. పెరిక రాజమల్లును 108 వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కేశవపట్నం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను నమోదు చేసుకొని ప్రమాదంపై విచారణ చేపట్టారు.



నుజ్జునుజ్జు అయిన ఆటో



ప్రమాదంలో ధ్వంసమైన టాటా ఏస్ ఆటో

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ



దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

పెద్దపల్లిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) దొంగతనాలకు పాల్పడుతున్న పలువురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ చోరీ తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మల్హార్‌రావు మండల్ రెడ్డిపల్లికి చెందిన బొరిగం సంపత్ తన తల్లి చనిపోగానే తండ్రి మరో వివాహం చేసుకున్నాడు. ఇంట్లో పరిస్థితులు అనుకూలించక చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ఇదే క్రమంలో 2005లో దొంగతనానికి పాల్పడి అదే వృత్తిగా ఎంచుకున్నాడు. గోదావరిఖని, మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్, వరంగల్, హన్మకొండ, మంథని, కొయ్యూరు, హసన్‌పర్తి తదితర ఏరియాల్లో దొంగతనాలకు పాల్పడి 36 కేసుల్లో జైలు జీవితం అనుభవించాడు. జైలు నుంచి విడుదలైన అనంతరం మళ్లీ అదే వృత్తిని కొనసాగించాడు. ఇదే క్రమంలో ఈ నెల 2న కాల్వశ్రీరాంపూర్ మండలం చిన్నరాతుపల్లికి చెందిన మద్దెల శాంతమ్మ ఇంట్లో ఎవరు లేని సమయంలో చొరబడి బీరువా తాళం పగుల గొట్టి నగదు బంగారం దోచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తారుపల్లి వద్ద గురువారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన సంపత్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడి నుంచి 2 లక్షల 25 వేల నగదు, 149 గ్రాముల బంగారం సుమారు(13 లక్షలు) ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సీఐ సుబ్బారెడ్డి, వెంకటేష్, సిబ్బంది అశోక్, లక్ష్మన్, వినుస్తర్, రవీందర్, ప్రభాకర్, రమేష్, రాజు, రాజ్‌కుమార్, లను ఏసీపీ అభినందించారు. దొంగను కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

సుల్తానాబాద్‌లో ఇద్దరు

● సుల్తానాబాద్: ఇళ్ల తాళాలు పగులకొట్టి రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ గురువారం రాత్రి తెలిపారు. సుల్తానాబాద్ మార్కండేయ కాలనీకి చెందిన వేముల చంద్రప్రకాష్, సుల్తానాబాద్ గాంధీనగర్‌కు చెందిన బైరి కిరణ్ ఇద్దరు కలసి అనేక దొంగతనాలకు పాల్పడ్డారు. వేముల చంద్రప్రకాష్ గంజాయి కేసుల్లో కూడా పలు సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. గత జనవరి 17న గాంధీనగర్‌లోని వంగల శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంట్లో ఇద్దరు నిందితులు తాళాలు పగులకొట్టి టీవీ దొంగిలించారు. టీవీని అమ్మగా వచ్చిన 20వేల రూపాయలను ఇద్దరు పంచుకున్నారు. వీరి కోసం పోలీసులు గాలిస్తుండగా శాస్త్రినగర్ వద్ద పట్టుబడగా వానిరి అదుపులోకి తీసుకుని ఇరవై వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వేముల చంద్రప్రకాష్‌పై సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు కేసులు, పెద్దపల్లిలో ఒకటి, నిజామాబాద్‌లో ఒక కేసు, కరీంనగర్‌లో ఓ కేసు ఉందని ఎస్‌ఐ సీహెచ్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చొప్పదండిలో ఇద్దరు

● చొప్పదండి: చొప్పదండిలో కాపర్‌వైర్ దొంగతనం చేసిన ఇద్దరు దొంగలను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. చొప్పదండిలోని శ్రీరామ ఇంజనీరింగ్ అండ్ ఎలక్ట్రానిక్స్ గోదాంలో ఉన్న కాపర్‌వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని మంగళవారం ఫిర్యాదు చేయగా, గురువారం చొప్పదండి బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు ఒక పెద్ద సంచితో అనుమానాస్పదంగా కనిపించారని తెలిపారు. ఇద్దరిని పట్టుకొని తనిఖీ చేయగా కాపర్ వైర్లు కనిపించాయని, విచారించగా దొంగలించిన సొత్తుగా గుర్తించి గోగులకొండ మహేష్, కడారి అభిషేక్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

గోగులకొండ మహేష్, రామ్‌టెక్ శివప్రసాద్, కడారి అభిషేక్‌లు స్నేహితులుగా ఉంటూ ఈజీ మనీ కోసం దొంగతనాలు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తిలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ రుద్రవ రం రాజు(47) గురువారం మృతి చెందాడు. రాజు మృతిపై అనుమానాలు న్నాయని మృతుడి తల్లి రుద్రవరం సుగుణ కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాజు కడుపులో ఇన్‌ఫెక్షన్‌తో అనారోగ్యానికి గురయ్యాడని, అతడి భార్య పట్టించుకోలేదని, బుధవారం తమ కొడుకును చూసేందుకు వెళ్లగా బయటకు గెంటేశారని, గురువారం ఉదయం రాజు మృతి చెందినట్లు సమా చారం అందించారని పేర్కొంది. కానిస్టేబుల్ రాజు మృతికి అతని భార్య, ఆమె తల్లిదండ్రులు, ఒక కానిస్టేబుల్ మరి కొందరిపై అనుమానాలున్నాయని తెలిపింది. దీనితో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పెళ్లి ఊరేగింపులో అపశ్రుతి

● నృత్యం చేస్తున్న వారిపైకి దూసుకెళ్లిన కారు

శంకరపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లిలో ఓ పెళ్లి ఊరేగింపులో గురువారం అపశ్రుతి చోటు చేసుకున్నది. పెళ్లి ఊరేగింపు జరుగుతుండగా ఓ కారు నృత్యం చేస్తున్నవారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నరేందర్‌రెడ్డి విమర్శనాస్త్రాలు ఎవరిపై?



- లోటుపాట్లపై నివేదిక ఇస్తానని ప్రకటన
- మూడు నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గాయని ఆవేదన
- జిల్లాలో నాయకత్వ లోపముందని వ్యాఖ్య

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోరాడి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి తన ఓటమికి గల కారణాలు, ఎన్నికల సందర్భం లో జరిగిన లోటుపాట్లపై పార్టీ నాయకత్వానికి నివేదిక ఇస్తానని ప్రకటిం చారు. కాంగ్రెస్‌కు జిల్లాలో నాయకత్వ లోపం ఉందని, దీనిని అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్తానని వ్యాఖ్యానించడం పార్టీలో కలకలం సృష్టిస్తున్నది. చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు తక్కు వ వచ్చాయని, కరీంనగర్‌లో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు.

రాజకీయంగా ఎవరిపై బాణం ఎక్కుపెట్టారని చర్చించుకుంటు న్నారు. ఎన్నికల సందర్భంగా పార్టీ కార్యకర్తలు తన వద్దకు రావడానికి కొంత మంది అనుమతి తీసుకోవలసిన పరిస్థితి ఎదుర్కొన్నారని, పార్టీలో గ్రూపు రాజకీయాలు ఉన్న నేపథ్యంలో సమన్వయం పరిచే నాయకత్వం లోపించిందని నరేందర్‌రెడ్డి అన్నారు. పార్టీ ప్రక్షాళనకు తనవంతు కృషిచేస్తానని పేర్కొన డంతో ఆయన ఎవరిపై ఫిర్యాదు చేయనున్నారు అన్నది చర్చనీ యాంశంగా మారింది.

అన్ని వేళ్లూ అటు వైపే..

నరేందర్‌రెడ్డి ఓట్లు తక్కువ వచ్చాయని పేర్కొన్న మూడు నియోజక వర్గాల్లో సిరిసిల్ల మినహా మిగతా రెండింటిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతి నిధ్యం వహిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాలు కరీంనగర్ పార్లమెం ట్ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గంలో మంత్రి పొన్నం ప్రభాకరే ఇప్పటికీ పూర్తి స్థాయిలో నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యత వహిస్తున్నారు. నరేందర్‌రెడ్డి అసంతృప్తి ఆయా నియో జకవర్గ ఎమ్మెల్యేలు, పార్లమెంట్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌పైనేనా అన్న చర్చ సాగుతోంది. కరీంన గర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పురమల్ల శ్రీనివాస్ ఇదివరకే తనకు ఏ స్వేచ్ఛ లేకుండా పోయిందని, నియోజక వర్గ ఇన్‌చార్జిగా తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని నిరసన వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయిన వెలిచాల రాజేందర్‌రావు నిజానికి పార్లమెంట్ ఇన్‌చా ర్జిగా వ్యవహరించాలి. ఆయన పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నారో లేదో ఆయనకే తెలియని పరిస్థితి జిల్లాలో నెలకొన్నది.

కరీంనగర్ జిల్లా మొత్తం సుడా పరిధిలోకి వచ్చినా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి పలు సమావేశాలకు ఆహ్వానమే అందడం లేదు. ఈ ముగ్గురు నేతలు కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో ఉంటూ తమకు ప్రాధాన్యం లేకుండా పోయిందని పరోక్షంగా పలుమార్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ఇప్పుడు నరేందర్‌రెడ్డి కూడా వారి సరసనే చేరా రా... ఆయన పేరు పేర్కొనకపోయినా జిల్లాలో సమన్వయ పరిచే నాయకత్వం లేదనడం మంత్రి ఆ పని చేయడం లేదని పరోక్షంగా చెప్పడ మేనా... అని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

శ్రీధర్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు

ఒకటికి రెండు సార్లు మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతూ తన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని తనకు అండగా నిలిచారని ప్రకటించడం కూడా ఈ చర్చకు దారితీసినట్టు యింది. ఎన్నికల అనంతరం నరేందర్‌రెడ్డి రాజకీయాల్లో ఉండరు.. ఆయన స్కూల్స్ నడుపుకుంటారని వ్యాఖ్యానించినవారికి జవాబుగా పట్టభద్రుల ఎన్నికల్లో ఓటమి తనకు మరింత బాధ్యతలను పెంచిందని, కాంగ్రెస్ వాదిగా పార్టీలో మరింత చురుకుగా పనిచేస్తూ ఏ బాధ్యత అప్పగించినా నిర్వహిస్తానని, ఇక నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటానని ప్రకటించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తన ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని 42 నియోజకవర్గాలలో తాను గమనించిన సమస్య లను, పట్ట భద్రులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పడం రేపటి నుంచే తన కార్యాచరణ ప్రారంభమవు తుందని ప్రకటించడం పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలని అన్న నిర్ణయానికి నరేందర్‌రెడ్డి వచ్చారని ఆ పార్టీ నాయకులు అనుకుంటు న్నారు. నరేందర్‌రెడ్డి పార్టీలో లోటుపాట్ల పేరిట ఏ అంశాలు ప్రస్తావి స్తారు.. ఏ నాయకులపై ఫిర్యాదులు చేస్తారు... అన్నదే పార్టీలో సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్న అంశంగా మారింది.

కాంగ్రెస్‌వాదిగా ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతా

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి తన బాధ్యతను మరింత పెంచిందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ వాదిగా ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతానని ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేం దర్‌రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావే శంలో మాట్లాడారు. ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా తనపై చేసిన విషప్రచారాన్ని పట్టభద్రులు పట్టించు కోలేదని, తనకు అండగా నిలిచి ఓట్లు వేశారని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకోసం కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ శ్రేణులకు, అల్ఫోర్స్ కుటుంబ సభ్యులకు సీపీఐ, సీపీఎం, టీజేఎస్, వివిధ కుల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాలకు కృతజ్ఞతలు తెలి పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని తనకు అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామో దర రాజన ర్సింహ, పొన్నం ప్రభాకర్‌తోపాటు నాలుగు జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇన్‌చార్జిలు, డీసీసీ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం నిర్విరామంగా పనిచేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ప్రచారం, పోలింగ్‌బూత్‌ల మేనేజ్‌మెంట్ వరకు మంత్రే చూసు కున్నారని, తన గెలుపునకు తీవ్రంగా కృషి చేశారని అన్నారు. ఎన్నిక లకు ముందు నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని నియోజకవర్గాల్లో పట్టభద్రులకు ఇచ్చి న హామీల అమలుకు తన కార్యాచరణ ఉంటుందని, అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు.. కాం గ్రెస్‌లో లోటుపాట్లపై పార్టీ పెద్దలకు నివేదిక ఇస్తానని, పార్టీలో స్తబ్దత నెలకొందని పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వేతనాలు అందక ఇబ్బందులు



రెండు నెలలుగా ఉపాధిహామీ సిబ్బంది ఎదురుచూపులు

పెద్దపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఉపాధినిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం సమయానికి వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో ఈజీ ఎస్ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవిలో ఉపాధిహామీ పథకాన్ని గ్రామాల్లో ఉద్యోగు లు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వర్తించే కార్యాలయ ఉద్యోగుల కు నెల రోజుల వేతనం రాకపోగా, గ్రామాల్లో విధు లు నిర్వర్తించే ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనా లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సమ యానికి వేతనాలు లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లే కీలకం

ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల్లో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు కీలకపాత్ర పోషి స్తున్నారు. ఈజీఎస్ ద్వారా రైతువేదికల నిర్మాణాలు, రైతుకల్లాలు, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, ఇంకుడు గుంతలు, మరు గుదొడ్ల నిర్మాణం, అవెన్యూ ప్లాంటేషన్, పశువుల షెడ్లు, మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, మొక్కల రక్షణ, కాలువ లు శుభ్రంతో పాటు పలు రకాల పనులను గ్రామా ల్లో చేపడుతున్నారు.

ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు సజావుగా నిర్వహిం చేందుకు కీలకపాత్ర పోషిస్తూ పనిభారంగా మారు తున్న అవేమీ పట్టనట్టుగా ఓపికతో నిర్వర్తిస్తున్నారు. పెద్దపల్లి మండలంలోని 30 గ్రామాలకు 30 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు 22 మంది మాత్రమే ఉన్నారు. వీరితో పాటు ఏపీవో, జేఈ ఒకరు, టెక్నికల్ అసి స్టెంట్‌లు ముగ్గురు, ఒకరు కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు.

ఉదయం నుంచే ఉపాధి పనుల్లో ఉద్యోగులు

తెల్లవారుజాము నుంచే ఫీల్డ్ అసిస్టెంట్‌లు జాబ్ కార్డు దారుల వారికి ఉపాధి పనులు కల్పిస్తున్నారు. గ్రామాల వారిగా ఉపాధి కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఇచ్చిన కొలతల ఆధారంగా కూలీలు పనులు ముగిం చుకొని వెళ్లే వరకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనులు పర్య వేక్షిస్తునే ఉంటారు. వీరితో పాటు టెక్నికల్ అసిస్టెంట్ లు, ఉన్నతాధికారులు సైతం ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్నారు. కూలీలకు పనులతోపాటు హరిత హారంలో నాటిన మొక్కలను రక్షించేందుకు నీరు అం దించడం, నర్సరీల్లో మొక్కల పెంపుదల, పశువుల షెడ్లు అవసరం ఉన్నవారికి అమలు పనుల్లో ఉద్యో గులు నిమగ్నమవుతారు. అధికారులు ఇచ్చిన లక్ష్యాల కు అనుగుణంగా ఉపాధి కూలీలను తీసుకొచ్చే బాధ్యతను ఫీల్డ్ అసిస్టెంట్‌లు తీసుకుంటున్నా ప్రభు త్వాలు పట్టించుకోని పరిస్థితి ఉంది.



పొద్దంతా కష్టపడుతున్నాం..: సుమలత, కొత్తపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్

గ్రామాల్లో ఉదయం నుంచి చేపడుతున్న పనులను కిందిస్థాయి కూలీలతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వర్తిస్తున్నాం. కనీసం ప్రభుత్వం మమ్మల్ని గుర్తించని పరిస్థితి ఉంది. ఓ వైపు లక్ష్యాలు ఇస్తే వాటికి అనుగుణంగా పనులు పూర్తి చేస్తున్నాం. పొద్దంతా కష్టపడుతున్న సమయానికి వేతనాలు రాకపోవడంతో ఇంట్లో పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ప్రభుత్వాలు చొరవ తీసుకొని ప్రతీ నెల మొదటి వారంలోనే వేతనాలు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలి.



ప్రతి నెల వేతనాలు అందించాలి
రమేష్‌బాబు, ఏపీవో, పెద్దపల్లి

పనులకు అనుగుణంగా సమయా నికి ప్రతీ నెల వేతనాలు అందించాలి. నిత్యం ఫీల్డ్ ఉంటున్న ఈజీఎస్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలను సమయానికి అందిస్తే ఆర్థిక ఇబ్బం దులకు గురికాకుండా ఉంటాం.

ధర్మపురి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- ఈ నెల 10 నుంచి ప్రారంభం

ధర్మపురి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మార్చి 10 నుంచి 22 వరకు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తు న్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల ప్రకారం ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు గోపురాలకు, దేవాలయం లోపల రంగులు వేయించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి అందంగా అలంకరణ చేస్తున్నారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయం లోపల, బయట ప్రత్యేక క్యూలైన్లు, కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల దాహర్తి తీర్చడం కోసం ఆలయం లోపల, బయట దాతల సహకారంతో చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్యవైశ్య, వర్తకులు, రైస్‌మిల్ యజమానులు, దాత లు, స్వచ్ఛంద సంస్థలు కలిసి భక్తుల సౌక ర్యార్థం బ్రాహ్మణ సంఘం, టీటీడీ ఆవర ణలో అన్నదానం కోసం ఏర్పాట్లు చేస్తు న్నారు. ఆలయం లోపల, బయట సోడి యం హైపోక్లోరైడ్ స్ప్రే చేయిస్తున్నారు. భక్తుల కోసం 25 క్వింటాళ్ల పులిహోర ప్రసాదం, ఒక లక్ష లడ్డు ప్రసాదాలు తయారు చేయిస్తున్నారు. 60 సీసీ కెమెరా లు దేవాలయాల పరిసరాల్లో, గోదావరి నదీ తీరంలో, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్య వేక్షిస్తున్నారు. సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ తదితరులు ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగనీయకుండా చర్యలు తీసుకుంటున్నారు.

రాజన్న ఖజానాకు రూ.2.31 కోట్ల నగదు

- బంగారం 201 గ్రాములు, వెండి 16.20 కిలోలు



హుండీ లెక్కింపు చేస్తున్న సిబ్బంది, భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఖజానాకు రూ.2 కోట్ల 31 లక్షల 65 వేల 333 నగదు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. రాజన్న ఆలయంలోని ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య గురువారం హుండీలను లెక్కించారు. 201 గ్రాముల బంగారం, 16 కిలోల 200 గ్రాముల వెండి, సమకూరినట్లు తెలిపారు. రాజన్న ఆలయంలో 14 రోజుల హుండీలను లెక్కించామని, మహా శివరాత్రి జాతర సందర్భంగా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

కొండగట్టులో 10నుంచి పవిత్రోత్సవాలు



మల్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ దేవస్థానంలో ఈ నెల 10 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహి స్తున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. ప్రతియేటా లోక కల్యాణార్థమై త్రయా హ్నిక దీక్షచే మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవా యితీగా వస్తోంది. పవిత్రోత్సవాల్లో భాగం గా నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పారాయణం, నిర్వహించనున్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీలు

సిరిసిల్ల టౌన్, మార్చు 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని స్కానింగ్ కేంద్రాలను గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ సూర్యశ్రీరావు ఆకస్మిక తనిఖీలు చేశారు. స్కానింగ్ కేంద్రాలలోని రికార్డులను పరిశీలించి ఫారం ఎఫ్‌లు సరిగా నిర్వర్తించవలసిందిగా సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యశ్రీరావు మాట్లాడుతూ రేడియా లజిస్ట్, గైనకాలజిస్ట్ డాక్టర్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలని అన్నారు. లింగనిర్ధారణ నిషేధిత చట్ట స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈ తనిఖీలను సిరిసిల్ల పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు.

ఈ తనిఖీల్లో జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల గైనకాలజిస్ట్ డాక్టర్ సుచిత్రలక్ష్మి, జిల్లా పీవోఎంహెచ్ఎన్ ఇన్‌చార్జి డాక్టర్ సంపత్‌కుమార్, డిప్యూటీ డెమో రాజ్‌కు మార్, హెచ్‌ఈ బాలయ్య, సఖీ కన్సల్టెంట్ రోజా, కానిస్టేబుల్ శ్రీలత, డాటా ఎంట్రీ ఆపరేటర్ మహేష్ పాల్గొన్నారు.



స్కానింగ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న డాక్టర్ సూర్యశ్రీరావు

యోగా శిక్షకురాలికి జాతీయ అవార్డులు



అన్నపూర్ణ

కోల్‌సిటీటౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన యోగా శిక్షకురాలు కొంకన అన్నపూర్ణ రెండు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికైంది. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తరప్రదేశ్‌కు చెందిన శాంతి ఫౌండేషన్ సంస్థ సావిత్రిబాయి పూలే పేరిట వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు ఇంటర్నేషనల్ ప్రైడ్ ఉమెన్ అవార్డులను అందజేస్తుంది. ఈ అవార్డుకు అన్నపూర్ణను ఫౌండేషన్ ఎంపిక చేసింది. హన్మకొండకు చెందిన వినిశెట్టి జగదీశ్వరయ్య మెమోరియల్ ట్రస్ట్ ఇన్‌స్పిరేషనల్ ఉమెన్ అవార్డుకు అన్నపూర్ణను ఎంపిక చేసింది.

అడుగంటిన పెద్ద చెరువు



పెద్ద చెరువులో తగ్గిన నీరు

- చుట్టూ కాలువలున్నా ప్రయోజనం శూన్యం
- తూము ఏర్పాటు చేయాలని రైతుల విజ్ఞప్తి

మల్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో పెద్ద చెరువుకు రెం డు పక్కల కాకతీయ కెనాల్ ఉప కాలువలు ఉన్నా వేసవిలో నీరు లేక వెలవెలబోతోంది. తూము నిర్మిస్తే వేసవిలో పంటలకు సాగు నీరు అందే అవకాశం ఉం ది. చెరువుకు రెండు పక్కల కాకతీయ కెనాల్ ఉప కాలువలు ఉన్నా వేసవిలో పంటలకు పూర్తి స్థాయిలో నీరందని పరిస్థితి ఏర్పడింది. పెద్ద చెరువు కింద వం దలాది ఎకరాల భూముల్లో రైతులు సాగు చేస్తుంటా రు. ఈ చెరువుకు సమీపంలో నుంచి రెండు పక్కల డీ65, డీ67 ఉప కాలువలు నిండుగా ప్రవహిస్తున్నా యి. ఈ చెరువుపై మనాల శివారులోని దమ్మక్క చె రువు కాకతీయ కాలువ పక్కన ఉండగా అక్కడి నుం చి ప్రస్తుతం నీరు వచ్చే అవకాశం లేదు. దీంతో డీ65 నుంచి తూము ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. తూము ఏర్పాటు చేస్తే వందలాది ఎకరాలకు సాగు నీరు అందడంతో పాటు గ్రామంలోనూ భూగర్భ జలా లు వృద్ధి చెందుతాయని రైతులు పేర్కొంటున్నారు.

తూము నిర్మించాలి

ముదుగంటి రాజు, మ్యాడంపల్లి

డీ65 ఉప కాలువ నుంచి తూము ఏర్పాటు చేస్తే పెద్ద చెరువు నింపుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తు తం కాలువ వద్ద పైపులు అమర్చి ఉన్నప్పటికీ వాటి నుంచి నీటి మళ్లింపు అంతంత మాత్రమే. దీంతో చెరువులోకి నీరు వచ్చే అవకాశం లేక పంటలకు నష్టం వాటిల్లుతోంది. గతంలో తూము ఏర్పాటు చేయాలని అధికారులను కోరాం. మళ్లీ కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తాం.





మ్యాడంపల్లిలో నీరందక ఎండుతున్న వరి, తూము ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం, ఉప కాలువ నుంచి ఏర్పాటు చేసుకున్న పైప్‌లైన్

ఎస్సారార్‌లో ముగిసిన జాతీయ సదస్సు

గణేశ్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో 'ప్రాచీన తెలంగాణ వాఙ్మ యం ఒక అవలోకనం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. కళాశాల, కరీంన గర్ తెలుగు భాగం, ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రాచీన వాఙ్మయ పరిశోధనే జీవధాతు అని అన్నారు. ఇక్కడ జాతీయ సదస్సు నిర్వహిం చడం గొప్పవిషయమన్నారు. ఎందరో సాహితీ ఉద్దండులు నడయాడిన నేలలో కందపద్యంతో తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించడం ఆనందంగా ఉందన్నారు. పద్నాలుగు భాషలు వచ్చిన పండితులు ఇదే నేలలో జన్మించడం, శేషప్ప సిద్ధప్ప వంటి పద్య కవులు విలసిల్లిన కరీంనగర్ భూమి చాలా గొప్పదన్నారు. మనుషులు యాంత్రిక మైపోయిన సమయంలో సదస్సు ద్వారా గొప్ప రచయితలు వక్తలు ఒకచోట చేరడం అభినందనీయమన్నారు. డాక్టర్ వెల్దండ నిత్యానందరావు, డాక్టర్ కల్వకుంట రామకృష్ణ, నెల్లూరు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సాగి కమలాకర్ శర్మ, బెనారస్ హిందూ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ బూదాటి వెంకటేశ్వర్లు, కళాశాల తెలుగు విభాగ అధిపతి డాక్టర్ భూర్ల చంద్రశేఖర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాజయ్య పాల్గొన్నారు.



మట్లాడుతున్న డాక్టర్ వెల్దండ నిత్యానందరావు

అధ్యాపకులకు గైడ్‌షిప్ అవకాశం కల్పించాలి

గణేశ్‌నగర్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేసే అర్హులైన అధ్యాపకులం దరికీ గైడ్‌షిప్ అవకాశం కల్పించాలని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. సురేందర్‌రెడ్డి కోరారు. బుధ వారం ఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అర్హులైన అధ్యాపకులను పీహెచ్‌డీ పర్యవేక్షకులుగా గుర్తించాలని, పరిశోధన అవకాశాలు పెంపొందించాలని అన్నారు. యూజీసీ కళాశాల విద్యాశాఖ నిబంధనలను అనుసరించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను క్లస్టర్లుగా గుర్తిం చాలన్నారు. కొన్ని కళాశాలల్లో అర్హులైన అధ్యాపకులు ఉన్నా సంబంధిత కోర్సులు అందుబాటులో లేకపోవడంతో పరిశో ధనలకు ప్రతిబంధకంగా మారిందన్నారు. కళాశాలలను క్లస్టర్‌లుగా చేసి అన్ని విభాగాలను ఒకే యూనిట్ పరిధిలోకి తీసుకొస్తే అడ్డంకులు తొలిగిపోతాయన్నారు. టీజీసీజీటీఏ ఎస్‌యూ కోఆర్డినేటర్ డాక్టర్ కె. మల్లారెడ్డి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, సంఘం బాధ్యులు డాక్టర్ టి.శ్రీనివాస్, ఎస్.రమేష్ బాబు ఉన్నారు.



వీసీకి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడిగా విజయానందరావు



రామగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంథని డివిజన్ ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడిగా బొల్లవరం విజయానందరావు గురు వారం ఎన్నికయ్యారు. మంథనిలో నిర్వహించిన డివిజన్ కమిటీకి రామగిరి మండల నుంచి ఉపాధ్యక్షుడిగా విజయానందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డివిజన్ కమిటీ సభ్యుడు కాట వినయ్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికపై స్థానిక పాత్రికేయులు కొండ్ర సుకుమార్‌గౌడ్, కృష్ణ, సంతోష్, ప్రదీప్, నాగరాజు, వాసుదేవరావు అభినందనలు తెలిపారు.

వేద విద్య సత్యానికి మార్గదర్శకం

మంథని, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేద విద్య సత్యానికి మార్గదర్శకంగా నిలుస్తుందని వేద పండితుడు నల్లొండ పురుషోత్తమశర్మ అన్నారు. స్థానిక శ్రీశీలేశ్వర-సిద్దేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న సంపూర్ణ రుగ్వేద స్వాహాకార యజ్ఞంలో ఆయన వేద పఠనతో లోకం సంపూర్ణ సుభిక్షంగా నిలుస్తుందన్నారు. లోక కళ్యాణార్థం ఇలాంటి వేద పారాయణ కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వేద పఠనం, యజ్ఞం, ఆధ్యాత్మిక ప్రవచనాల అనంతరం భక్తులకు తీర్థ, అన్నప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు వొజ్జల గణేష్‌శర్మ, ఆమ్నాయవర్ధిని మిత్ర బృందం, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



స్వీట్లు తినిపించుకుంటున్న న్యాయవాదులు



సుల్తానాబాద్‌లో సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నేతలు

కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపొందడంపై జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేసి, బాణాసంచా కాల్చారు.

కోల్‌సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖని కోర్టు సముదాయంలో సంబరాలు చేసుకున్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, సిబ్బంది, కక్షిదారులకు స్వీట్లు పంపిణీ చేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అమరేందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై మేధావులు, పట్టభద్రుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీతో పాటు పట్టభద్రుల స్థానంలోనూ బీజేపీ అభ్యర్థులు గెలిచారన్నారు. ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ లీగల్ సెల్ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ శీతకాని చంద్రశే ఖర్, జిల్లా అధ్యక్షుడు సంజయ్‌కుమార్, బీజేపీ లీగల్ సెల్ బాధ్యులు ఆరె మధు, కడారి సురేష్, ప్రవీణ్‌కుమార్, సతీష్‌రెడ్డి, పాత అశోక్, మచ్చు రామస్వా మి, హిందువాహిని జిల్లా అధ్యక్షుడు రాకం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: గోదావరిఖని చౌరస్తాలో జరిగిన సంబరాల్లో బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, బీజేపీ నాయకులు హన్మంతుగౌడ్, గుండబోయిన భూమయ్య, కోడూరి రమేష్, సతీష్, క్యాతం వెంకటరమణ, దాసరి ఉష, మామిడి వీరేశం, రాజేందర్, రాకేష్, జక్కుల పద్మ, అపర్ణ, శ్వేతప్రియ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పట్టణంలోని ఐబీ గెస్ట్‌హౌస్ వద్ద రాజీవ్ రహదారిపై జరిగిన సంబరాల్లో బీజేపీ పట్టణ మండల శాఖల అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, కందుల శ్రీనివాస్, జిల్లా నేతలు కడారి అశోక్‌రావు, సొదరి మహేందర్, కొమ్ము తిరుపతి, కందునూరి తిరుపతి, మహేష్, వేగోళం శ్రీనివాస్‌గౌడ్, నాగులమల్యాల తిరుపతి, ఏగోలపు సదయ్య, రాజేంద్రప్రసాద్, ఇగురం రామస్వామి, సదయ్య, పవన్, ఎనగందుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖనిలో..

కమాన్‌పూర్: మండల కేంద్రంలో కమాన్‌పూర్ బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కొయ్యడ సతీష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మంథని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి మచ్చగిరి రాము, నాయకులు మట్ట శంకర్, జంగేపల్లి అజయ్, బర్ల సది, మల్లారపు అరుణ్‌కుమార్, ఇరుగురాళ్ల పోచం, కొమ్ము శ్రీనివాస్, పల్లి చంద్రయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం: పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులుగా చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య గెలుపుపై బీజేపీ మండల అధ్యక్షుడు బిరుదు గట్టయ్య గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

రామగిరి: మండలంలోని సెంటినరీ కాలనీలో జరిగిన సంబరాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్ నాయకులు తొట్ల రాజు, చిదురాల శివ, కందుల రమేశ్, నాగరాజు, మహేష్, సంపత్, మోహన్, సాయిరాం, కమలాకర్, రొడ్డ వరలక్ష్మి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామగుండాన్ని వణికిస్తున్న విష జ్వరాలు

- వాంతులు, విరేచనాలు, దగ్గు జలుబులతో జనం పరేషాన్

కళ్యాణ్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు సంభవించడంతో రామగుండంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. పగలు ఎండ, రాత్రి చలి తీవ్రతతో రోగాలు తొందరగా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తున్నాయి. నిన్నటి వరకు 38డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఒకే రోజులో అకస్మాత్తుగా నాలుగు డిగ్రీలు పడిపోయి 34డిగ్రీలు నమోదు అయ్యింది. అదే స్థాయిలో 19.6 డిగ్రీల నుంచి 13.6డిగ్రీలకు పడిపోయింది. చాలా మందికి దగ్గు, జలుబు, జ్వరాలతో పాటు వాంతులు, విరేచనాలతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. చాలా మందికి దగ్గు, జలుబు ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందడం, ఊపిరితిత్తుల్లో నీరు చేరడం వంటి సమస్యలతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరుతున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

రోజుకు 1300 నుంచి 1500మంది ఓపీ వచ్చే ప్రభుత్వ జనరల్‌ఆసుపత్రిలో చాలా మంది జ్వరాలు, వాంతులు, విరేచనాల కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. వాతావరణంలో అకస్మాత్తుగా మార్పులు సంభవించడంతో వ్యాధులు వస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. జ్వరాలు, వాంతులు, విరేచనాలతో బాధపడేవారిని ఆసుపత్రిలో ఇన్ పేషెంట్లుగా చేర్చుతూ చికిత్సను అందిస్తున్నారు. చిన్న పిల్లల్లో కూడా ఎక్కువగా జలుబు, దగ్గు, శ్వాసకు సంబంధించిన వ్యాధులతోనే ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మంది ఎక్కువ ఉన్న చోట మాస్కులు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని కనబరచాలి

జేఎన్టీయూ ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్

రామగిరి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని కనబరచాలని జేఎన్టీయూ ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్ సూచించారు. గురువారం మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీ-జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, జిల్లాలకు చెందిన 12 టీంలు టోర్నమెంట్ పాల్గొంటున్నాయి. తొలుత వివిధ జిల్లా క్రీడాకారులతో ప్రిన్స్‌పాల్ పరిచయం చేసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్

- **సెమీ ఫైనల్‌లో మంథని జేఎన్‌టీయూ...**

తొలి రోజు జరిగిన రెండు మ్యాచ్‌ల్లోను మంథని జేఎన్‌టీయు గెలిచి మొదటి సెమీఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ట్రినిటి, కొత్తగూడెం జట్లతో జరిగిన రెండు మ్యాచ్‌ల్లో మంథని జేఎన్‌టీయూ విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు విజేతలకు ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్, ఆడ్రియాల ప్రాజెక్టు అసిస్టెంట్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, లైబ్రరీ ఇన్‌చార్జి రమణ, పరిపాలనాధికారి సుమన్, ఏఈఈ ప్రభాకర్, కాంట్రాక్టర్ శ్రావణ్, పీడీ సునీల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం




క్షీరాభిషేకం నిర్వహిస్తున్న లారీ యజమానులు

జ్యోతినగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఏరియా టిప్పర్ లారీ, లైన్ లారీ ఓనర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎన్టీపీసీలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్టీపీసీ యాష్‌పాండ్‌లో బూడిద లోడింగ్ కోసం రెండు మెషిన్లను ఏర్పాటు చేయించడం, స్థానిక లారీలకు బూడిద రవాణాకు అవకాశమివ్వడంపై యజమానుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వద్ద ఆ సంఘాల నాయకులు ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మక్కాన్‌సింగ్ ఎమ్మెల్యే కాకముందు, అయిన తరువాత లారీ యజమానులకు, డ్రైవర్లకు మేలు చేశాడని టిప్పర్ లారీ యజమానుల సంఘం అధ్యక్షడు బడికెల శేఖర్, లైన్ లారీల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎన్టీపీసీ బూడిద చెరువు నుం లోకల్ లారీలకు ప్రాధాన్యత కల్పించేలా యాష్ పాండ్‌లో రెండు యంత్రాలను ఏర్పాటు చేయించాడన్నారు. బీఆర్ఎస్ నాయకుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. తమకు బతుకుదెరువు చూపిస్తున్న ఎమ్మెల్యేపై బురద చల్లడం సరైంది కాదన్నారు. లారీ యజమానులు, డ్రైవర్ల విషయంలో రాజకీయాలు చేయవద్దన్నారు. కార్యక్రమంలో లారీ యజమానులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శిగా రాకేష్

మంథని, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా మంథనికి చెందిన ఆర్‌కే ఫ్లెక్సీ అధినేత నాగెల్లి రాకేష్ గురువారం ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముడి సరుకు ధరలు విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా ఈనెల 7న జిల్లాలో ఉన్న ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపులు బంద్ చేయడం జరుగుతుం దన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ధరలు పెంచుతున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



ఆర్జీ-2లో క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 కాలనీలో గురువారం సింగరేణి ఆర్జీ-2 యాజమాన్యం క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించింది. ఆర్జీ-2 ఏరియాతో పాటు ఓసీపీ-1, 11 ఇంక్లయిన్ లలో పని చేస్తున్న ఉద్యోగులకు చేంజ్ ఆఫ్ క్వార్టర్స్, క్వార్టర్ లేని వారికి క్వార్టర్ల కేటాయించేందుకు గాను అధికారులు సీఈఆర్ క్లబ్‌లో వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో 565 క్వార్టర్లకు గాను 233 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 127 మంది హాజరయ్యారు. వారిలో 108 మందికి అధికారులు క్వార్టర్లను అలాట్ చేశారు. కార్యక్రమంలో అఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం సంతోష్ కుమార్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, సివిల్ ఈఈ ప్రతాపగిరి రాజు, డైవీపీఎం వేణుగోపాల్, క్వార్టర్ సెక్షన్ ఇంచార్జి మమత, స్పోర్ట్స్ సూపర్ వైజర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సింగిరెడ్డిపల్లెలో వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-2 యాజమాన్యం ఆధ్వర్యంలో శుక్రవారం సింగిరెడ్డిపల్లెలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు జీఎం బండి వెంకటయ్య తెలిపారు. వకీల్‌పల్లె గని ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని రేమేడియేషన్ మేషర్స్ కింద వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు జీఎం పేర్కొన్నారు. వకీల్‌పల్లె గని ప్రభావిత గ్రామమైన సింగిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సింగరేణి వైద్యులు వైద్య పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎం బండి వెంకటయ్య సూచించారు.

కాంట్రాక్టు కార్మికుల హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బుర్ర తిరుపతి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బుర్ర తిరుపతి డిమాండ్ చేశారు. గురువారం ఓసీపీ-3 సీహెచ్‌పీలో బెల్ట్‌క్లీనింగ్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వస్తే సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని, చట్టబద్ద హక్కులు అమలు చేసేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీలు ఇచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా హామీల అమలు మాత్రం కాలేదన్నారు. 20 ఏళ్లుగా వేతనాలు పెంచకుండా కాంట్రాక్టు కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తున్నట్టు తిరుపతి పేర్కొన్నారు. కోల్‌ఇండియాలోని ఇతర బొగ్గు సంస్థల్లో అమలు చేస్తున్న వేతనాలు ఇవ్వడం లేదని, జీఓ 22ను గెజిట్ చేసి కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయడం లేదని, దీంతో ఆర్థికంగా కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. కోల్‌ఇండియా వేతనాలు అమలు చేయాలని, లేదా జీఓ 22ను గెజిట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకుందామని తిరుపతి పిలుపునిచ్చారు. ఈసమావేశంలో రామస్వామి, రమేష్, రాజు, లింగయ్య, శంకర్, మల్లేష్, జాన్సన్, మహేందర్, కిషోర్, చంద్రయ్య పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- శాంతిఖని గని విస్తరణ కోసం భూముల అవసరం లేదు

బెల్లంపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శాంతిఖని గని విస్తరణ కోసం భూముల అవసరం లేదని, రైతులు ఆందోళన చెందొద్దని మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శాంతిఖని గని లాంగ్‌వాల్ ప్రాజెక్టు కోసం గురువారం శాంతిఖనిగని ఆవరణలో ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమం సంబంధిత అధికారులు నిర్వహించారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు, రైతులు పెద్దఎత్తున లాంగ్‌వాల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా శాంతియుత ర్యాలీ నిర్వహిస్తూ ప్రజాభిప్రాయ సేకరణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ మోతిలాల్ రాష్ట్రకాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయ అధికారి లక్ష్మణ్‌ప్రసాద్ హాజరయ్యారు. సమీప గ్రామాల ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ శాంతిఖనిగని లాంగ్‌వాల్ ప్రా జెక్టుతో భూగర్భ జలాలు తగ్గుతాయని పర్యా వరణ సమస్యలు తలెత్తుతాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వందలాది మంది రైతులు వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తూ జీవనోపాధి పొందుతున్నారని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతిలాల్

అనంతరం అదనపు కలెక్టర్ మోతిలాల్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయ అధికారి లక్ష్మణ్‌ప్రసాద్ మాట్లాడుతూ శాంతిఖనిగనిని ఓపెన్‌కాస్టు చేయడం లేదని ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని వెల్లడించారు. శాంతిఖని గని భవిష్యత్ కోసం లాంగ్‌వాల్ ప్రాజెక్టు చేపడుతామని సూచించారు. ఈ ప్రాజెక్టు కోసం రైతుల భూములకు కూడ అవసరం లేదని చెప్పారు. ఈసమయంలో ప్రజాభిప్రాయ కార్యక్రమానికి హాజరైన సమీప గ్రామాలప్రజలు ఒక్కసారిగా లాంగ్‌వాల్ ప్రాజెక్టు వద్దని ఆందోళన చేశారు. దీంతో పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. అనంతరం ప్రజాభిప్రాయ సేకరణలో సమీప గ్రామాల ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అన్నదాతల నిరీక్షణ

(5వపేజీ తరువాయి)

ఇప్పటి వరకు గుర్తించిన సాగు భూముల్లో నాలా కన్వర్షన్ కాకుండా పంటలకు బదులు రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇటుక బట్టీలు, ఇతర చిన్నచిన్న పరిశ్రమలను ఏమైనా ఉన్నాయా అని పరిశీలించాలని ఇటీవల ప్రభుత్వం రెవెన్యూ, వ్యవసాయ శాఖలను ఆదేశించింది. నామమాత్రంగా సర్వేచేసిన సదరు అధికారులు జిల్లాలో సాగుచేయని భూములు లేవని రిపోర్టు ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ ఖాతాల్లో రైతు భరోసా కింద డబ్బులు జమచేయాలని మూడెఎకరాలకు పైబడిన రైతులు కోరుతున్నారు.

టీఆర్ఎస్‌డీ జిల్లా అధ్యక్షుడిగా ఆనంద్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌గౌడ్

పెద్దపల్లిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా రక్షణసమితి డెమొక్రటిక్(టీఆర్ఎస్‌డీ) పార్టీ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వాసంపల్లి ఆనంద్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్‌గౌడ్ నియామక పత్రాన్ని అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తోడేటి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ, టీఆర్ఎస్(డి) పార్టీని బలోపేతం చేయడం కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అన్నిఅనుబంధ కమిటీలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. విద్యార్థులు, యువకులు, మహిళలు ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత హామీల అమలు కోసం ప్రజల పక్షాన ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల రమేష్, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా విద్యార్థి విభాగం ఇన్‌చార్జి ఎదురు నర్సింగ్, జిల్లా సహాయ కార్యదర్శి మామిడిపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దంత వైద్య దినోత్సవం

పెద్దపల్లిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దంత వైద్య దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో గురువారం వేడుకలు నిర్వహించారు. ప్రజలకు సేవలు అందిస్తున్న దంత వైద్యులు డాక్టర్ విజయ్ డాక్టర్ సుస్మిత, సీనియర్ డాక్టర్లు, ఆర్ఎంఓలకు కలెక్టర్ కోయ శ్రీహర్ష శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో దంత వైద్య సేవలు ప్రజలకు చెరువులో ఉన్నాయని, అవసరమైన ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. అలాగే సీజేరియన్ సెక్షన్ సర్జరీని విజయవంతంగా జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య బృందాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందిస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాటారం మండలానికి చెందిన సంధ్య నెలలు నిండిన గర్భిణీ, ఆమె కు ప్లేట్ లెట్స్ పడిపోవడంతో వైద్యులు సకాలంలో స్పందించి పేషంట్ బంధువులకు కౌన్సెలింగ్ నిర్వహించి కావాల్సిన జాగ్రత్తలతో గురువారం సిజేరియన్ సెక్షన్ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్ర చికిత్సను విజయవంతగా నిర్వహించిన డాక్టర్ అనసూయ ,డాక్టర్ రామం, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ డాక్టర్ల బృందాన్ని, ఆసుపత్రి సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. జిల్లా ఆసుపత్రిలో మాతా శిశు ఆసుపత్రిలో వివిధ రకాల స్పెషలిస్ట్ సేవలు, శస్త్ర చికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



వీవోల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్

ముత్తారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని 14 గ్రామపంచాయతీల్లో స్వశక్తి సంఘాల్లో పనిచేస్తున్న మహిళలు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో సురేష్ సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీవోలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. స్వశక్తి సంఘాల మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉంటుందని వాటిని గ్రామాల్లోని ఇతర మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల వైద్యాధికారి మాట్లాడుతూ టీబీ వ్యాధిపై మహిళల్లో అవగాహన కల్పించాలని వ్యాధి నిర్మూలన పట్ల జాగ్రత్తలు తెలియజేయాలని వారికి తెలియజేశారు. ఐకేపీ ఏపీఎమ్ పద్మ, వీవోలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పరిశీలిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్‌కుమార్

కమాన్‌పూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పారిశుధ్య కార్యక్రమాలు పనులను నిరంతరం డివిజనల్ పంచాయతీ అధికారి కె సతీష్‌కుమార్ సూచించారు. కమాన్‌పూర్ మండలంలోని గ్రామపంచాయతీని సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి తగు సూచనలు జారీ చేశారు. నిరంతరం ఇంటింటా చెత్త సేకరణ జరగాలని, ఎస్‌డబ్ల్యూఎమ్ షెడ్‌లో సెగ్రిగేషన్ ప్రక్రియ జరిగి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని సూచించారు. ప్లాస్టిక్, డ్రై వేస్ట్‌ను అమ్మి డబ్బులను గ్రామపంచాయతీ ఖాతాలో జమచేయాలని సూచించారు. ఇంటి పన్నుల వసూలును ఈ నెల 12వ తేదీలోపు 100శాతం పూర్తిచేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులను ఇంటికి వెళ్లి సంప్రదించి రెగ్యులర్ చేసుకు నేవిధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీలో నిరంతర పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, గ్రామప్రజలకు నీటి ఎద్దడి రాకుండా మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎండీ బాబా

జూలపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మోసగాళ్లపై విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఎస్ బాబా ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కాలంలో కొందరు మోసగాళ్లు ఊరురా తిరుగుతూ విద్యుత్‌వినియోగ దారుల వద్దకు వెళ్లి విద్యుత్ మీటర్‌ను తిరగకుండా చేసి విద్యుత్‌బిల్లు రాకుండా చేస్తామని డబ్బులు దండుకుంటున్నారని అలాంటి వ్యక్తులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. మీటర్‌ను తిరగకుండా చేస్తే చట్టరీత్యా నేరం అవుతుందని అలాంటి వ్యక్తులు మీవద్దకు వస్తే స్థానిక పోలీసులకు లేదా విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించాలని వినియోగదారులకు సూచించారు.